AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
15-4-2026 (Wednesday) MAIN EDITION

## సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ



**అక్షరటుడే, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. నామినేటెడ్ పదవుల భర్తీ, పదవీకాలం ముగిసిన కార్పొరేషన్ ఛైర్మన్ల రెన్యూవల్‌పై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అలాగే సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీ మార్పు, జగిత్యాల నియోజకవర్గంలో పరిణామాలపై కూడా భేటీలో చర్చకు వచ్చినట్లు సమాచారం.

## బుల్ దూకుడు.. భారీగా పెరిగిన సూచీలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా - ఇరాన్ మరోసారి శాంతి చర్చలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు అందుతున్న సంకేతాలతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లు పాజిటివ్‌గా ఉండడంతో దేశీయ స్టాక్ మార్కెట్‌లోనూ ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ భారీగా లాభపడ్డాయి.చివరికి సెన్సెక్స్ 1,263 పాయింట్ల లాభంతో 78,111 వద్ద, నిఫ్టీ 207 పాయింట్ల లాభంతో 24,231 వద్ద స్థిరపడ్డాయి.

## ఆప్ ఎంపీ ఇంటిపై ఈడీ దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆప్ రాజ్యసభ సభ్యుడు అశోక్ కుమార్ మిత్తల్ ఇంటిపై ఈడీ దాడులు చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించి మిత్తల్ నివాసం సహా.. ఆయనకు సంబంధించిన పలు వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సోదాల వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

## సీబీఎస్ఈ టెన్త్ ఫలితాలు రిలీజ్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సీబీఎస్ఈ టెన్త్ సెషన్–1 పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. విద్యార్థులు ఉమాంగ్ యాప్‌లో రిజల్ట్స్ చూసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 17 నుంచి మార్చి 11 మధ్య పరీక్షలు జరగగా సుమారు లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంప్రూవ్ మెంట్ కోసం సెషన్–2 పరీక్షలు మే 15 నుంచి జరుగనున్నాయి.

## 20న మేడిగడ్డకు సీఎం రేవంత్



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల బ్యారేజీల మరమ్మతు పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. వర్షాకాలంలోపు అత్యవసర పనులు పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## డీలిమిటేషన్‌తో
# బీజేపీ కుట్ర



**డీలిమిటేషన్ పేరుతో బీజేపీ మరో కొత్త కుట్రకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేశామని చెప్పారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- **దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే పోరాటం**
- **భూములు కబ్జా చేస్తున్న సీఎం**
- **కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు**

మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. హైదరాబాద్ నగరంలో సంతోషంగా ఉన్నది దోమలు, దొంగలు మాత్రమేనని ఎద్దేవా చేశారు. నగరంలో ఎక్కడబడితే అక్కడ భూములు కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. ఓ పక్క సీఎం రేవంత్ రెడ్డి, మరోపక్క మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కబ్జాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను బద్నాం చేసి హామీలు అమలు చేయకుండా తప్పించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలను కోరారు.

### ఉప్పల్ ఫ్లై ఓవర్ పూర్తి చేయాలి

ఉప్పల్ ఫ్లై ఓవర్ భూమి పుట్టినప్పటి నుంచి నడుస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం దీని పనులు చేపట్టి 8 ఏళ్లు అయిందని, ఎక్కడ పని అక్కడే ఉందన్నారు. ఫ్లై ఓవర్‌ను బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తామంటే మేమే కడతాం అన్నారని చెప్పారు.

### మళ్లీ గెలుస్తాం

మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మూడు క్లిన్ స్వీప్ చేశామని కేటీఆర్ అన్నారు. మళ్లీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మల్కాజ్‌గిరి కార్పొరేషన్ ఎన్నికలు సెప్టెంబర్, అక్టోబరులో నిర్వహించే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే బుల్డోజర్ వస్తుందని, అందుకే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.

## ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్ ఫలితాలు విడుదల అయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం ఉదయం ఫలితాలను రిలీజ్ చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 77శాతం, సెకండియర్‌లో 81 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను https://resultsbie.ap.gov.inలో చెక్ చేసుకోవచ్చు. అలాగే వాట్సప్‌లోనూ (9552300009)ఈ ఫలితాలు పొందొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఏపీలో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 23 వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. మొత్తం దాదాపు 10.50 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మంత్రి అభినందించారు. ఫెయిల్ అయిన వారు నిరుత్సాహ పడొద్దని.. మళ్లీ పరీక్షలు రాసి విజయం సాధించాలని సూచించారు.

## బీజేపీ నాయకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలోని బడంగ్‌పేట్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉరి వేసుకుని తనువు చాలించాడు. కుటుంబ కలహాలే మృతికి కారణమని మీర్‌పేట పోలీసులు తెలిపారు. కాగా.. బడంగ్‌పేట్‌లో జరిగిన అవినీతిపై రామకృష్ణారెడ్డి పోరాటం చేశారు. బుధవారం ఉదయం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కింగ్స్ వే విల్లాస్‌లో ఉన్న తన నివాసంలో రామకృష్ణ రెడ్డి ఉరివేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్



**అక్షరటుడే, ఏపీ:** తెలుగు దేశం పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్‌ను నియమించింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీలను తాజాగా ప్రకటించింది. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు కొనసాగుతున్న విషయం తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు ఉన్నారు. అయితే ప్రస్తుతం ఆ పార్టీ ఏపీకే పరిమితం కావడంతో అన్ని నిర్ణయాలు చంద్రబాబు నాయుడు తీసుకుంటారు. పేరుకు పల్లా శ్రీనివాసరావు అధ్యక్ష పదవి నామమాత్రమే. తాజాగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రబాబు తనయుడు లోకేశ్‌ను నియమించడంతో పార్టీలో ఆయన స్థానాన్ని బలోపేతం చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

## బీహార్ సీఎంగా సమ్రాట్ చౌదరి ప్రమాణం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ ముఖ్యమంత్రిగా బీజేపీ నేత సమ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో అత్యున్నత పదవిని చేపట్టిన భారతీయ జనతా పార్టీకి చెందిన తొలి నాయకుడిగా ఆయన నిలిచారు. బీహార్ సీఎంగా సుదీర్ఘ కాలం పని చేసిన నితీశ్‌కుమార్ ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ పదవి బీజేపీ నేత సమ్రాట్ చౌదరికి దక్కింది. చౌదరి మంగళవారం బీజేపీ శాసనసభ పక్ష నాయకుడిగా ఎన్నికయ్యారు, దీంతో ఆయన నియామకానికి మార్గం సుగమమైంది. బుధవారం ఉదయం ఆయన చేత గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు.

## మండుతున్న ఎండలు.. నాలుగు రోజులు జాగ్రత్త..

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో నాలుగు రోజులు ఎండల తీవ్రత అధికంగా ఉండనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 9 గంటలు దాటిందంటే ఎండ తీవ్రత మొదలు అవుతోంది. సాయంత్రం 5 గంటల వరకు కూడా ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం పూట వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే 4 రోజులు తీవ్రమైన వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు ఎండ తీవ్రత గరిష్ట స్థాయిలో ఉంటుంది. ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణలో 42-44 డిగ్రీలు హైదరాబాద్‌లో 4142 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

## అండమాన్ వద్ద పడవ బోల్తా.. 250 మంది గల్లంతు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అండమాన్ సమీపంలో సముద్రంలో ఒక పడవ బోల్తా పడడంతో సుమారు 250 మంది రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ జాతీయులు గల్లంతయ్యారు. పురుషులు, మహిళలు, పిల్లలతో నిండిన ఆ ట్రాలర్ బలమైన గాలుల కారణంగా మునిగిపోయిందని ఐక్యరాజ్యసమితి శరణార్థుల హై కమిషనర్ తెలిపింది. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఆ పడవ దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుంచి మలేషియాకు వెళ్తున్నట్లు సమాచారం.

## సీఎం స్టాలిన్‌కు ఓటమి భయం..: అన్నామలై

**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎలాగైనా గెలవాలని అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐడీఎంకేలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై బుధవారం కోయంబత్తూరులో ప్రచారం నిర్వహించారు. తమిళనాడులో ఏఐడీఎంకే, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అన్నామలై మాట్లాడుతూ.. కోయంబత్తూరులో, తమిళనాడు అంతటా ఈసారి ఎన్డీయే భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## అమ్మ పేరుతో మొక్కలు నాటండి: మోదీ



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమ్మ పేరుతో మొక్క నాటాలని, నీటిని సంరక్షించాలని ప్రధాని మోదీ కోరారు. ఆయన కర్ణాటకలో బుధవారం పర్యటించారు. కర్ణాటకలోని మాండ్య జిల్లాలోని ఆదిచుంచనగిరిలో శ్రీ గురు భైరవైక్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలు స్వదేశీ ఉత్పత్తులు వాడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయాలని, పరిశుభ్రత పాటించాలని, స్థానిక పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని కోరారు. మన సమాజంలో కేవలం ఆధ్యాత్మిక మార్గదర్శకత్వానికే పరిమితం కాని మహనీయులు ఆవిర్భవిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. వారు సమాజాన్ని దుఃఖం, బాధలు, ఇబ్బందుల నుంచి బయటపడేసే మార్గాన్ని చూపించారన్నారు. కాలభైరవ ఆలయంలో దర్శనం, పూజలో పాల్గొనడం, శ్రీ గురు భైరవైక్య మందిరపు బ్రహ్మాండమైన ప్రారంభోత్సవానికి హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు.

## మత్స్యకారులకు అన్యాయం: జగన్



**అక్షరటుడే, ఏపీ:** రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మరో ఉదాహరణ అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. వారి కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టులకు శ్రీకారం చుట్టామన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఫిషింగ్ హార్బర్లు ప్రారంభించామని తెలిపారు. రామాయపట్నం పోర్టు పనులు 95 శాతం పూర్తి చేశామని, శ్రీకాకుళంలోని మూలాపేట పోర్టులో 35 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. రూ.26 వేల కోట్లతో పోర్టుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

## కియారా అంత రిస్క్ చేసిందా..!



**పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే కియారా అద్వానీ చుట్టూ తిరుగుతున్న ఓ బోల్డ్ సీన్ వివాదం ఇండస్ట్రీలో పెద్ద డిబేట్‌కు దారి తీసింది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రల్లో కనిపించినా, ఎప్పుడూ ఒక లిమిట్‌లోనే ఉన్న కియారా.. ఈసారి కథ డిమాండ్ మేరకు ఓ సాహసోపేత సన్నివేశంలో నటించిందనే టాక్ వినిపిస్తోంది. అయితే ఫైనల్ అవుట్‌పుట్ చూసిన తర్వాత, ఆ సీన్ తన పబ్లిక్ ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందేమోనని ఆమె ఆందోళన చెందుతూ.. దాన్ని తొలగించాలని కోరినట్లు టాక్ వినిపిస్తోంది.**

**–అక్షరటుడే, సినిమా డెస్క్**